AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
18-7-2026 (Saturday)
MAIN EDITION

## ధరణిలో అనేక అక్రమాలు : పొంగులేటి



**అక్షరటుడే, హైదరాబాద్:** ధరణిలో అనేక అక్రమాలు జరిగాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వం ధరణి నిర్వహణను ప్రైవేట్ సంస్థకు ఇచ్చిందన్నారు. ఫోరెన్సిక్ ఆడిట్‌లో అక్రమాలు బయట పడ్డాయని తెలిపారు. ధరణిపై విచారణకు ఎస్ఈటీ విధివిధానాలు త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. అక్రమాలు నిర్ధారణ అయితే ఎంతటివారైనా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి : మంత్రి వివేక్




**అక్షరటుడే, మెదక్:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని మంత్రి వివేక్ అన్నారు. మెదక్ జిల్లా చేగుంటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ష్యూరిఫై స్కూల్ కిట్స్ నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. క్రమశిక్షణ అనేది ప్రతి విజయవంతమైన వ్యక్తి ముఖ్య లక్షణమని, విద్యార్థులు తమ చదువులతో పాటు కష్టపడి పనిచేసే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు.

## కష్టపడి చదవాలి : మంత్రి అజారుద్దీన్



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మంత్రి అజారుద్దీన్ సూచించారు. అరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను శనివారం ఆయన సందర్శించారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, హాస్టళ్లు, భోజనశాలలు, క్రీడా మైదానాలు, పారిశుద్ధ్య సదుపాయాలు పరిశీలించారు

## గొడ్డలి పార్టీనే ప్రధాన సమస్య : చంద్రబాబు



అక్షరటుడే, ఏపీ : రాష్ట్రంలో కుట్రలు, కుతంత్రాలు ఇంకా కొనసాగుతున్నాయని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. డబ్బులతో సోషల్ మీడియాను నడిపిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో గొడ్డలి పార్టీనే ప్రధాన సమస్య అన్నారు. మహిళల మాన, ప్రాణాలకు పూర్తి రక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు.

## అందెశ్రీకి నివాళి



అక్షరటుడే, హైదరాబాద్ : తెలంగాణ అమరవీరుల స్మారకం అమర జ్యోతి వద్ద ప్రజా కవి అందె శ్రీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ కోదండరాం నివాళులు అర్పించారు. అనంతరం ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన కవులు, కళాకారులతో సమావేశం అయ్యారు.

**యూత్ డిక్లరేషన్ పేరిట యువతను మోసం చేసిన కాంగ్రెస్‌కు డెత్ డిక్లరేషన్ రాయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ నగరంలోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన యువ సంగ్రామ సదస్సులో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇప్పటి నుంచి మరొక లెక్క అన్నారు. ఉరకలెత్తే యువతరం సభకు వచ్చిందన్నారు. యువత కదం తొక్కితే ఉద్యమాలు ఉప్పెనలు అవుతాయని పేర్కొన్నారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

# కాంగ్రెస్‌కు డెత్ డిక్లరేషన్ రాయాలి



- యువత తలచుకుంటే పీఠాలు కదులుతాయి
- నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కాంగ్రెస్ చేసిన మహా ద్రోహాన్ని గుర్తు చేసుకోవడానికే యువ సంగ్రామ సదస్సు నిర్వహించినట్లు కేటీఆర్ అన్నారు. 38 నెలల కిందట ఇదే సరూర్‌నగర్‌లో కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ పేరిట యువతను దగా చేసిందన్నారు. పాత కేటుగాళ్లు, కొత్త డూప్లికేటుగాళ్లు నకిలీ ప్రేమ నటించి యూత్ డిక్లరేషన్ ఇచ్చారన్నారు. ఢిల్లీ నుంచి ప్రియాంక గాంధీ వచ్చి యూత్ డిక్లరేషన్ ఇచ్చారన్నారు. ఇందులో 24 హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అందులో ఒకటి కూడా నెరవేర లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిత్తుల మారి ముసలి నక్క యువతరాన్ని మోసం చేసిందన్నారు. కాంగ్రెస్‌కు అధికార పీఠం వచ్చి 31 నెలలు అవుతున్నా.. హామీలపై ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్‌కు ఓటేయవద్దని ఇంటింటికి తిరిగిన యువత ఇప్పుడు బాధపడుతోందన్నారు. కాంగ్రెస్‌కు డెత్ డిక్లరేషన్ రాస్తేనే సోయి వస్తుందన్నారు.

### రాహుల్‌గాంధీపై విమర్శలు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్ గాంధీ తెలుగులో ట్వీట్ చేశారని గుర్తు చేశారు. ఆయనకు తెలుగు రాదని, తెలివి లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగాలు అడిగితే నిరుద్యోగులపై లాఠీఛార్జీ చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు అశోక్ నగర్‌లో వచ్చి చెప్పినా రాహుల్ గాంధీ ఇప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

### లూటీఫికేషన్ నడుస్తోంది

జాబ్ క్యాలెండర్, 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందో రాహుల్ గాంధీ చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణలో నోటిఫికేషన్ కాదు, లూటీఫికేషన్ నడుస్తోందని ఆరోపించారు. జాబ్ క్యాలెండర్ వదిలేసి జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి 70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు రుజువు చేస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని కేటీఆర్ ప్రకటించారు.

### కొన్ని పొరపాట్లు జరిగాయి

తమ హయాంలో కొన్ని పొరపాట్లు జరిగాయని కేటీఆర్ అంగీకరించారు. టీఎస్‌పీఎస్సీలో పేపర్ లీక్ అయిందన్నారు. పొరపాట్లను సరి చేసుకుంటామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో 2.32 లక్షల నియామకాలు చేపట్టామన్నారు. అయితే తాము ఉద్యోగాల ఇచ్చినట్లు ప్రచారం చేసుకోలేదన్నారు. దీంతోనే కాంగ్రెస్ నాయకులు అబద్ధాలు ప్రచారం చేశారన్నారు. రాజీవ్ యువ వికాసం పేరిట సబ్సిడీ లోన్లు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అది ఎక్కడైనా అమలు అవుతుందా అని ప్రశ్నించారు.




## శంషాబాద్‌లో ఉద్రిక్తత

**అక్షరటుడే, రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సమీపంలోని బహదూర్‌గూడలో బుల్లెట్ ట్రైన్ టెర్మినల్ భూసేకరణ కోసం అధికారులు రాగా ఉద్రిక్తత నెలకొంది. సరైన పరిహారం, హామీలు ఇచ్చే వరకు భూములు ఇవ్వబోమంటూ రైతులు ఆందోళనకు దిగడంతో అక్కడ భారీగా పోలీసులు మోహరించారు. బహదూర్‌గూడలో 650 ఎకరాలు స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఆ భూములు ఇచ్చేందుకు రైతులు ఒప్పుకోవడం లేదు. సరైన పరిహారం ఇచ్చాకే భూములు ఇస్తామని ఐదు రోజులుగా నిరసన తెలుపుతున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం పోలీసులు, హైడ్రా అధికారులు గ్రామానికి చేరుకున్నారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. భూమిని స్వాధీనం చేసుకోకుండా రైతులు అడ్డుకోవడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.

## పేదలపైకి బుల్డోజర్ : కవిత



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** రంగారెడ్డి జిల్లా బహదూర్‌గూడలో భూముల సేకరణ కోసం అధికారులు, పోలీసులు వెళ్లడంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. బహదూర్‌గూడలో భూముల కోసం పేదలపైకి బుల్డోజర్ పంపడం సరికాదన్నారు. మహిళలు, రైతులు, గ్రామస్తులపై భారీగా పోలీస్ బలగాలను ప్రయోగించడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. ప్రజల అభిప్రాయాన్ని గౌరవించకుండా, హైడ్రా-రెవెన్యూ అధికారుల పేరుతో గ్రామస్తులను బలవంతంగా ఈడ్చుకెళ్లడం, అరెస్టులు చేయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలతో చర్చించి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## నింగిలోకి దూసుకెళ్లిన విక్రమ్–1 రాకెట్

**అక్షరటుడే, ఏపీ :** శ్రీహరి కోట నుంచి విక్రమ్ 1 రాకెట్‌లో నింగిలోకి దూసుకెళ్లింది. సతీశ్ దావన్ స్పేస్ సెంటర్ నుంచి మధ్యాహ్నం 12:05 గంటలకు చేపట్టిన ప్రయోగం విజయవంతం అయింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ప్రైవేట్ సంస్థ రూపొందించిన ఈ రాకెట్ ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలో ప్రవేశ పెట్టింది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న స్కైరూట్ ఏరోస్పేస్ విక్రమ్-1 రాకెట్‌ను తయారు చేసింది. శనివారం ఉదయం 11:30 గంటలకు జరగాల్సిన ఈ ప్రయోగం, చివరి నిమిషంలో తలెత్తిన సమస్యలతో ఆగిపోయింది. అనంతరం సమస్యను పరిష్కరించాక రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది.

## హర్ముజ్‌లో పేలిపోయిన రెండు ట్యాంకర్లు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** హర్ముజ్ జలసంధి మీదుగా ప్రయాణిస్తున్న రెండు చమురు ట్యాంకర్లు మందుపాతరలను ఢీకొని పేలిపోయాయని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ శనివారం తెలిపింది. అలాగే మరో నాలుగు నౌకలను తాము నిలువరించామని ఇరాన్ గార్డ్స్ తెలిపింది. అమెరికా సైన్యం మద్దతుతో నాలుగు నౌకలు జలసంధి గుండా వెళ్ళడానికి ప్రయత్నించగా, క్షిపణి, డ్రోన్ల సంయుక్త దాడిలో నిలిపివేశామని ఇరాన్ తెలిపింది. అయితే ఇరాన్ వాదనను అమెరికా ఖండించింది. ఐఆర్‌జీసీ చేసే చాలా వాదనల మాదిరిగానే, ఇది కూడా అబద్ధం అని పేర్కొంది. తమ నౌకలు పేలిపోలేదని తెలిపింది.



## కరుణించని వరుణుడు.. ఆందోళనలో రైతులు



**అక్షరటుడే, హైదరాబాద్ :** వరుణుడు ముఖం చాటేశాడు. వానాకాలం మొదలై నెలన్నర దాటుతున్నా.. భారీ వర్షాలు పడలేదు. రాష్ట్రంలో ప్రతి ఏటా వరిని ఎక్కువ మొత్తంలో సాగు చేస్తారు. ప్రస్తుతం వానలు లేకపోవడంతో అన్నదాతలు వరి వేయడానికి ఆలోచిస్తున్నారు. వానాకాలం మొదలైన నాటి నుంచి చెప్పుకోదగ్గ వర్షాలు పడలేవు. కాలువలు పారలేదు. చెరువుల్లోకి నీరు రాలేదు. దీంతో వరి నాట్లు సాగడం లేదు. ప్రస్తుతం బోరుబావుల కింద మాత్రమే వరి సాగు చేశారు. అయితే వానలు లేకపోవడంతో భూగర్భ జలాలు రోజు రోజుకు పాతాళంలోకి పడిపోతున్నాయి. దీంతో బోర్లు పోయాక వేసిన పంటలకు నీరు అందడం లేదు. ఫలితంగా అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరి కొందరు అప్పులు తెచ్చి కొత్తగా బోర్లు వేయిస్తున్నారు. అయినా చుక్క నీరు రాకపోవడంతో మనోవేదనకు గురి అవుతున్నారు.

## బీఆర్ఎస్ నాయకుల హౌజ్ అరెస్ట్

**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని సరూర్‌నగర్ స్టేడియంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో యువ సంగ్రామ సదస్సు నిర్వహించారు. అయితే ఈ సభకు వెళ్లకుండా పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను గృహ నిర్బంధం చేశారు. అనంతరం పోలీసులు అనుమతి ఇవ్వడంతో వారు సరూర్ నగర్ వెళ్లారు.



## శ్రీవారిని దర్శించుకున్న పవన్ సతీమణి



**అక్షరటుడే, తిరుమల :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పవన్ కల్యాణ్‌కు ఇటీవల శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు. ఈ క్రమంలో పవన్ త్వరగా కోలుకోవాలని ఆయన సతీమణి శ్రీవారిని దర్శించుకొని, పూజలు చేశారు. శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆమెకు అధికారులు ఘన స్వాగతం పలికారు. అన్నా లెజినోవా మెట్ల మార్గంలో స్వామివారిని దర్శించుకున్నారు. అలిపిరి నడకమార్గం ద్వారా ఆమె తిరుమల చేరుకున్నారు. శనివారం ఉదయం సుప్రభాత సేవలో పాల్గొన్నారు.

## నిరాహార దీక్షకు దిగిన అభిజిత్ దీప్కే




**అక్షరటుడే, ఢిల్లీ :** ఢిల్లీ జంతర్‌మంతర్ దగ్గర ఉద్రిక్తత నెలకొంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని 20 రోజులుగా సోనమ్ వాంగ్‌చుక్ చేస్తున్న దీక్షను పోలీసులు భగ్నం చేసిన విషయం తెలిసిందే. దీంతో కాక్రోచ్ జనతా పార్టీ అధ్యక్షుడు అభిజిత్ దీప్కే నిరాహార దీక్షకు దిగారు. ఢిల్లీ పోలీసులు సోనమ్ వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించిన కొద్దిసేపటికే, అభిజీత్ దిప్కే నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష భగ్నం చేస్తే ఉద్యమం ఆగదని అన్నారు. తాను నిరాహార దీక్ష చేపడతానని, తాము ఇక్కడే ఉంటామని ప్రకటించారు. ఎల్లుండి పార్లమెంట్ వరకు పాదయాత్ర చేసి తీరుతామని తెలిపారు.